సాక్షి
విశాఖపట్నం

మంగళవారం : 5 : మార్చి : 2024



సెమీస్‌కు కబడ్డీ పోటీలు

70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. 8లో



అర్జీలు పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జేసీ మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. 8లో



రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.లక్ష్మిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

– విశాఖ సిటీ

విశ్వవ్యాప్తం.. విశాఖ వైభవం

- నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విజన్
- వాణిజ్య, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి
- ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో సదస్సు నిర్వహణ
- స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహణపై సీఎం సమక్షంలో ఎంవోయూలు
- రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం.. పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. విశాఖలో ఇతర పరిశ్రమలకూ ఆస్కారం ఉందన్న ఆలోచన దిగ్గజ పారిశ్రామికవేత్తల మదిలో కలిగేలా.. విశాఖను గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో విశ్వవ్యాప్తంగా ప్రమోట్ చేశారు. అందుకే.. దిగ్గజ పారిశ్రామికవేత్తలు వైజాగ్‌కు క్యూ కట్టారు. భవిష్యత్తులో విశాఖ వైభవాన్ని విశ్వం వినువీధుల్లో ప్రతిబింబించేలా సమగ్ర కార్యాచరణను అమలు చేసే ప్రణాళికలతో సీఎం వైఎస్ జగన్ ముందుకొస్తున్నారు. వాణిజ్యవేత్తలు, పారిశ్రామిక ప్రతినిధులతో ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో విజన్ విశాఖ సదస్సులో పాల్గొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో నడిచేలా విశాఖను నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సైతం అడుగులు పడుతున్నాయి.

విజన్ వైజాగ్ పేరుతో..

పరిశ్రమలకు పట్టుగొమ్మగా.. ఉపాధి కల్పనకు ఆలంబనగా.. పెట్టుబడులకు స్వర్గధామంగా.. అంతర్జాతీయ నగరంగా భాసిల్లుతున్న విశాఖ.. భవిష్యత్తులో మరింత గొప్పగా అభివృద్ధి చెందేందుకు ఉన్న వనరులేంటి..? వాటిని ఎలా వినియోగించుకోవాలి.. ప్రపంచ పటంలో విశాఖని ఎలా నిలబెట్టాలనే సంకల్పంతో విజన్ వైజాగ్ కాన్సెప్ట్‌తో సీఎం వస్తున్నారు. ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేసింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇప్పటికే పలుమార్లు నివాస యోగ్యమైన నగరంగానూ... వ్యాపారానికి అనువైన నగరాల్లో విశాఖపట్నం చరిత్రకెక్కింది. సరికొత్త విశాఖ ఆవిష్కృతమయేలా.. పరిశ్రమలు, పర్యాటకం, హాస్పిటల్స్, హోటల్స్, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు చెందిన సుమారు 2000 మందితో సీఎం చర్చించనున్నారు. విశాఖపట్నం విజన్ డాక్యుమెంటును ముఖ్యమంత్రి వివరించనున్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలలో కల్పించిన మౌలిక సదుపాయాల గురించి, విశాఖ నగరంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాల గురించి వైఎస్ జగన్ సంభాషించనున్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి 'భవిత'...

విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ.. రాష్ట్రంలోని విద్యార్థులు అంతర్జాతీయ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఇందుకోసం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా విద్యార్థులు నైపుణ్య రంగంలో నిష్ణాతులుగా మారాలనీ.. విశాఖని స్కిల్ డెవలప్‌మెంట్‌కి కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మంగళవారం భవిత కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుడుతున్నారు. మధురవాడలోని వీ-కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన 8 స్కిల్ డెవలప్‌మెంట్ స్టాల్స్‌ని పరిశీలిస్తారు. అనంతరం పరిశ్రమల భాగస్వాములతో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 3 ఒప్పందాల్ని సీఎం సమక్షంలో కుదుర్చుకోనున్నారు. ఈ సందర్భంగా స్కిల్‌లోగో, ఫ్లాగ్‌ని, స్కిల్ యాంథమ్‌ని, స్కిల్ యూనివర్స్ యాప్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, న్యూ స్కిల్స్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. నైపుణ్య శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతోనూ సీఎం మాట్లాడనున్నారు.

రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు...

విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నగర పర్యటనలో భాగంగా.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఆవిష్కరణలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రూ.98 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సుమారు రూ.100 కోట్లతో ముడసర్లోవలో నిర్మించనున్న జీవీఎంసీ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తారు. రూ.10 కోట్లతో టర్టెల్ బీచ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. వెంకోజీపాలెం నుంచి మారియట్ హోటల్ వరకు ఆల్టర్నేటివ్ డబుల్ రోడ్ నిర్మాణం, మధురవాడకు కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేయనున్న వాటర్ సప్లయ్ ప్రాజెక్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తదితర ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానంలో మంగళవారం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్ద చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. 'విజన్..విశాఖ' పేరిట నిర్వహించే సదస్సులో వివిధ రంగాల వాణిజ్య, పారిశ్రామిక వేత్తలతో సమావేశమవుతారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ 'భవిత స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో సమావేశమవుతారు. అనంతరం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.

యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు

- భవిత పేరుతో కొత్త కార్యక్రమం
- ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్, అధికారులు

మధురవాడ/పీఎంపాలెం : రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ చెప్పారు. సోమవారం పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద గల మధురవాడ వి. కన్వెన్షన్ సెంటర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధురవాడ పర్యటన, ఇక్కడ యువతతో ఇంటరాక్ట్ అవుతున్న కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో యువ టెక్నికల్ ఎడ్యుకేషనల్, ఒకేషనల్ ఎడ్యుకేషన్ రంగంలో మన యువతకు చాలా నైపుణ్యం ఉందన్నారు. పరిశ్రమల్లోని ఉద్యోగావకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. స్కిల్ ఎకో సిస్టం పేరుతో రాష్ట్ర స్థాయిలో స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే 192 చోట్ల స్కిల్ హబ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి ద్వారా 15లక్షల మందికి పైగా శిక్షణ ఇచ్చామన్నారు. 3.70లక్షలు మంది ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పించామన్నారు. దీన్ని ఇంకా పెద్ద ఎత్తున నిర్వహించడ కోసం భవిత పేరుతో షేపింగ్ ఫ్యూచర్ క్రియేటింగ్ ఆపర్చ్యునిటీస్ పేరుతో నిర్వహించే కార్యక్రమాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభిస్తారన్నారు. భవిత లోగో, యువత ఉపాధికి సంబంధించి ఆన్‌లైన్ యాప్‌ను కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ అండ్ సీఈవో ఎం. వినోద్‌కుమార్, జేసీ మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



చిన్న పిల్లల వార్డులో ఐసీయూ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం పరిశీలించారు. చిన్న పిల్లల అవసరాల నిమిత్తం ఆధునికీకరిస్తున్న ఐసీయూ వార్డు రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడ కల్పిస్తున్న మౌలిక వసతులు, ఇతర సదుపాయాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీహెచ్ ఓపీ గేట్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మి తులజీ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, వైద్యులు తదితరులు ఉన్నారు.

నేడు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ ప్రారంభం

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం వెనుక రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కాంప్లెక్స్‌లోనే ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొని వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర వాటిని ఒకే కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నగరానికి చేరుకున్న మంత్రి ఒక హోటల్‌లో బస చేశారు.

స్థాయీ సంఘ సమావేశం రేపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 68 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా జోన్-2 పరిధి 13వ వార్డు ముడసర్లోవ నర్సరీ పార్కులో పిల్లల ఆట స్థలంలో మౌలిక సదుపాయాలు, సివిల్ వర్క్స్ చేసేందుకు, హనుమంతువాక వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు, జోన్-2 పరిధి 8వ వార్డు తారకరామనగర్ శాటిలైట్ టౌన్, రుషికొండ లే అవుట్ ఓపెన్ స్పేస్‌లో పార్క్ అభివృద్ధి, గాజువాక 67వ వార్డు జోగవానిపాలెం నుంచి శంకర్‌నగర్ వరకు వీఆర్‌సీసీ కాలువ నిర్మాణం, కూర్మన్నపాలెం వుడా ఫేజ్-2 ఖాళీ స్థలంలో పార్క్ అభివృద్ధికి సంబంధించి అంశాలు చర్చకు రానున్నాయి.

కార్డుదారులకు రూ.11కే కిలో రాగి పిండి

మహారాణిపేట: చౌక ధరల దుకాణాల్లో కిలో రూ.11కు రాగి పిండి సరఫరా చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ డి.మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలో 5,29,054 మంది రేషన్ కార్డుదారులకు రాగి పిండి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.40 ఉన్న రాగి పిండిని రేషన్ షాపుల్లో రూ.11కే ఇస్తున్నామని వివరించారు.

ఏయూను సందర్శించిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధి



బ్రోడెరిక్‌ని సత్కరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఏయూను యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎంగేజ్‌మెంట్ మేనేజర్ బ్రోడెరిక్ మోన్‌క్రిఫ్ సోమవారం సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం పూర్వ డీన్ ఆచార్య ధనుంజయరావులతో సమావేశమయ్యారు. ఏయూలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేయడం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయూలో ఎంతో శక్తివంతమైన ఫార్మసీ కళాశాల, సైన్స్, ఆర్ట్స్, న్యాయ కళాశాలలు కలిగి ఉండటం వాటి ప్రత్యేకతలను రిజిస్ట్రార్ వివరించారు. ఏయూలో నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనం, ఆ హబ్‌లను బ్రోడెరిక్ సందర్శించారు. ఈ సందర్భంగా బ్రోడెరిక్‌ని రిజిస్ట్రార్ సత్కరించారు.

విద్య, సామాజిక, ఆర్థిక ప్రగతే నిజమైన అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం
- ఏయూలో పాలనలో కొత్త పంథా-మన కోసం-మన ప్రభుత్వం అంశంపై సదస్సు



మాట్లాడుతున్న అజయ్ కల్లాం

ఏయూక్యాంపస్ : ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య ప్రగతే నిజమైన అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం అన్నారు. అవర్ స్టేట్-అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏయూ టీఎల్ఎన్ సభామందిరంలో 'పాలనలో కొత్త పంథా-మన కోసం మన వద్దకు సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గత నాలుగున్నరేళ్లలో ఏపీలో విద్య, వైద్యం, మౌలిక వసతుల రంగంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సామాజిక సాధికారత రూపశిల్పిగా, అందరికీ విద్యను అందించే సంకల్పంతో ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ బోధన, ఐబీ ప్రవేశపెట్టడంతో పాటు ఎడెక్స్‌లో రెండు వేలకు పైగా కోర్సులు, గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను పేద విద్యార్థులకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసిన విధానం నిరుపమానమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఏయూను అభివృద్ధి పథంలో నిలిపి దేశంలోనే గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు మట్లాడుతూ తన సొంత గ్రామంలో నాడు-నేడు పథకంలో భాగంగా జరిగిన అభివృద్ధిని ఉదహరిస్తూ ముఖ్యమంత్రి చేస్తున్న విప్లవాత్మక మార్పులు, ప్రగతిని వివరించారు. కోవిడ్ మహమ్మారి కుదిపేసినా రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ప్రశాంత్‌కిశోర్ పరిణతి లేని వ్యక్తిత్వంతో మాట్లాడటం సరికాదన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి మీరంతా పరిరక్షణగా, వెన్నంటి నిలవాలని కోరారు. ఆచార్య టి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంతో యువతను అనుసంధానం చేశారన్నారు. విద్యా రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. కార్యక్రమంలో జి.శాంత మూర్తి, సురేష్ బేత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగరాజులమేనా?

- అన్నకే దిక్కులేదు.. మేమెంత? అంటూ నిర్వేదం
- విశాఖ దక్షిణ, గాజువాక, భీమిలి ఆశావహుల్లో అలజడి
- నాగబాబుకు ఝలక్‌తో పత్తా లేని సుందరపు బ్రదర్స్
- ఇప్పటికే జాడలేకుండా పోయిన జనసేన సీనియర్లు



సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన శ్రేణుల్లో సరికొత్త అలజడి రేగుతోంది. ఇప్పటికే టీడీపీతో పొత్తులో అరకొర సీట్ల కేటాయింపు వీరికి మింగుడు పడడంలేదు. చాలీచాలని సీట్లతో ఎవరికి ఎసరు వస్తుందోనని లోలోన ఆందోళన చెందుతున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి తానే బరిలో ఉంటున్నానని, అచ్యుతాపురంలో కాపురం కూడా పెట్టి నానా హంగామా చేసిన నాగబాబు.. పక్షం రోజులు తిరక్కుండానే పలాయనం చిత్తగించారు. ఈ పరిణామానికి జనసేన క్యాడరు షాక్‌కు గురైంది. పవన్ కల్యాణ్ సొంత సోదరునికే ఈ పరిస్థితి వస్తే ఇక మేమెంత? అంటూ పార్టీలో టిక్కెట్లను ఆశిస్తున్న వారు నిర్వేదంలో పడిపోయారు. ఇన్నాళ్లూ పార్టీలో నాగబాబుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని భావించిన వారికి ఆయనకు అంత సీను లేదని తేటతెల్లమైంది. నిజంగా జనసేనలో పట్టున్నా, లేక పవన్ వద్ద పలుకుబడి ఉన్నా నాగబాబుకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. స్వయంగా అన్నకే పార్టీలో దిక్కు లేదని, ఇక ఆయనను నమ్ముకుంటే తాము నట్టేట మునిగినట్టేనని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాగబాబుకు అన్ని విధాలా దన్నుగా నిలిచి, ఆయన వ్యవహారాలు చూస్తున్న యలమంచిలి ప్రాంతానికి చెందిన సుందరపు బ్రదర్స్ (విజయ్‌కుమార్, సతీష్‌కుమార్) సైతం నాగబాబు ఎపిసోడ్‌తో పత్తాలేకుండా పోయారు. వాస్తవానికి వీరిలో విజయకుమార్ యలమంచిలి, సతీష్‌కుమార్ గాజువాక సీట్లను ఆశిస్తున్నారు. ఇందుకోసం వీరు నాగబాబును ప్రసన్నం చేసుకుంటూ అటు అనకాపల్లి జిల్లాలోను, ఇటు విశాఖపట్నం జిల్లాలోనూ వార్తల్లో వ్యక్తులుగా నిలిచారు. నాగబాబు మనుషులుగా ముద్ర వేయించుకున్న వీరు కొంతమంది నుంచి వసూళ్లకు దిగారన్న ఆరోపణలున్నాయి. నాగబాబు తాజా పరిస్థితితో వీరు ఆందోళన చెందుతున్నట్టు చెబుతున్నారు.

త్యాగాలకు సిద్ధంకండి..

మరోవైపు భీమిలి జనసేన సీటు తనకే ఖాయమైందని బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్న పంచకర్ల సందీప్‌కు కాకుండా టీడీపీకి కేటాయిస్తున్నట్టు ప్రచారం ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరందుకుంది. ఈ సారి ఈ సీటును త్యాగం చేయాలని అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సందీప్‌కు స్పష్టం చేసినట్టు తెలిసింది. అలాగే గాజువాక స్థానం నుంచి తమ అభ్యర్థే బరిలో ఉంటారన్న ప్రచారాన్ని టీడీపీ నేతలు విస్తృతం చేశారు. దీంతో అక్కడ జనసేన సీటును ఆశిస్తున్న సుందరపు సతీష్‌కుమార్, కోన తాతారావులు కూడా త్యాగాలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఇక జనసేన నుంచి విశాఖ దక్షిణ సీటును వంశీకృష్ణ శ్రీనివాస్, సాధిక్, ప్రసాదరెడ్డి, కందుల నాగరాజు, డాక్టర్ మూగి శ్రీనివాసరావులు ఆశిస్తున్నారు. ఈ స్థానం నుంచి కూడా టీడీపీ అభ్యర్థే పోటీ చేస్తారని తెలియడంతో వీరంతా కలవరం చెందుతున్నారు.

ఆ ఇద్దరిలో ఒక్కరికే చాన్స్?

ఇక ఎమ్మెల్యే టిక్కెట్టును ఆశించి వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌లు జంప్ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో వీరిలో ఒక్కరికే జనసేన సీటు దక్కవచ్చని చెబుతున్నారు. పెందుర్తి స్థానం పంచకర్లకు దాదాపు ఖరారైందని చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే వంశీకృష్ణకు మొండి చెయ్యే గతయ్యే పరిస్థితి తలెత్తనుంది. అదే జరిగితే జనసేన త్యాగరాజుల జాబితాలో ఆయన కూడా చేరిపోనున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న కీలకనేతలు తమకు గుర్తింపు లేదని, నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఇవ్వడం వంటి పరిణామాలతో ఇప్పటికే జాడలేకుండా పోయారు. ఇప్పుడు వీరికి త్యాగమూర్తులు కూడా తోడయ్యే అవకాశం ఉంది.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



హాజరైన మహిళలు



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు

మద్దిపాలెం : మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రభుత్వం గుర్తింపునిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార వుడా కాలనీ మెయిన్‌రోడ్డులో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజునే మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వ పథకాలు అధికశాతం మహిళలకే నేరుగా అందజేస్తున్నామన్నారు. చేయూత పథకం ద్వారా ప్రతి మహిళకు ఐదేళ్లలో రూ.75వేలు అందేవిధంగా చర్యలు చేపట్టారని తెలిపారు. ఆర్థిక చేయూతనిచ్చే విధంగా ఐదేళ్లలో రూ.27వేల కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. మహిళా రక్షణకు దేశంలో ఎక్కడా లేని విధంగా దిశ యాప్‌ను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రతి ఇంట్లో మహిళలదే పైచేయిగా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఇళ్ల రిజిస్ట్రేషన్లు కూడా వారిపేరుమీదే చేస్తున్నారని చెప్పారు. నగర మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ఒకప్పుడు మహిళలు ఆకాశంలో సగం అనేవారు.. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 'ఆకాశంలో సగం' కాదు.. ఆమె ఆకాశం అన్నట్టు ఎదిగే అవకాశాలు కల్పించారన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత మహిళల కష్టాలన్నీ తీరిపోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, మహిళా పక్షపాతి జగన్ అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, పార్టీనేతలు పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు

- అదే సీఎం జగన్ లక్ష్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శాశ్వత భూ హక్కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : రాష్ట్రంలో పేదలందరూ పక్కా ఇళ్లలో నివసించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బి.ఆర్.తాళ్లవలసలో సోమవారం 13 పంచాయతీలకు చెందిన 750 మందికి జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జలజీవన్ మిషన్ నిధులు రూ.98.32 లక్షలు, ఐనాడలో రూ.49.20 లక్షలు, కోరాడలో రూ.1.18 కోట్లతో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చామన్నారు. పద్మనాభం మండలంలో 3,200 మందికి పట్టాలిచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పద్మనాభం, కృష్ణాపురం, బి.ఆర్.తాళ్లవలస, బోని గ్రామాల్లోని ఇనాం భూముల రైతులకు కూడా రైతు భరోసా ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ కోరాడ మంజు భార్గవి, బి.ఆర్.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు, పిన్నింటి సూర్యనాయణ, సిరుగుడి ఆదినారాయణ, జి.వి.కె.కె.వర్మ, ఈర్ల ఈశ్వరరావు, మరగడ అప్పారావు, కోన రమణ, సీర సూరప్పడు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, బుగత సత్యనారాయణ, బేపల గురునాయుడు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో బి.శైలజ పాల్గొన్నారు.

టీడీపీ అయినా పథకాలతో ఆదుకున్నారు



మా కుటుంబ సభ్యులు టీడీపీ సానుభూతిపరులు. అయినప్పటికీ తమకు సంక్షేమ పథకాలు ఇచ్చారు. తనకు ఇంటి స్థలం మంజూరు చేశారు. తన తండ్రి తవుడు పరంజా మీద నుంచి పడి మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చారు. తాను దివ్యాంగురాలిని కావడంతో రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. తన తల్లి అప్పలనారాయణకు చేయూత ద్వారా రూ.18,750 ఇచ్చారు. సీఎం జగనన్న మేలు మరిచిపోలేనది. ఈ సారి ఎన్నికల్లో తాను జగనన్న పార్టీకే ఓటేస్తాను

– దాసరి ఈశ్వరి కుమారి, దివ్యాంగురాలు, గెద్దపేట

ఫొటోగ్రాఫర్ హత్య కేసు నిందితులకు రిమాండ్

పీఎంపాలెం: జీవీఎంఎంసీ ఆరో వార్డుకు చెందిన వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ సాయి విజయ్ పవన్ కల్యాణ్‌ను అమానుషంగా హత్య చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించామని పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపారు. రావులపాలెం పాలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన షణ్ముఖ తేజ, కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన నక్కా వినోద్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి పరామర్శ



బక్కన్నపాలెంలోని సాయి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎంపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం ప్రాంతంలో హత్యకు గురయిన బక్కన్నపాలెంకు చెందిన పోతిన సాయివిజయ్ పవన్ కల్యాణ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. సాయి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయి అంతియాత్రలో పాల్గొన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట రాష్ట్ర నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, పోతిన హనుమంత రావు, ఎల్లాజీ మూర్తి బాబు, జామి శివ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితోనే గేయ రచయితగా మారా

- కళ్ల ముందు సంఘటనలే నా పాటలకు ప్రేరణ
- ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

భీమునిపట్నం: పాటల రచయిత కావడానికి తన తల్లిదండ్రులే స్ఫూర్తి అని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. భీమిలిలో కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆత్మీయ సత్కార, ఇష్టా గోష్ఠి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నతనంలో నాన్న పాటలు రాస్తే అమ్మ సవరణలు చేసేవారన్నారు. రచయితలైన అమ్మానాన్నల ప్రభావం నాపై పడిందన్నారు. పాటలు రాయాలని చిన్నతనంలోనే బలంగా అనుకున్నానని చెప్పారు. కళ్లముందు కనిపించిన ఎన్నో విషయాలు, సంఘటనలే నా పాటలకు ప్రేరణ అని తెలిపారు. 1994లో సినీ పరిశ్రమకు వచ్చానని నుంచి ఇప్పటి వరకు 3 వేల పాటలు రాశానన్నారు. నేనీస్థాయికి రావడానికి, నిలదొక్కుకోవడానికి దర్శకుడు దాసరి నారాయణరావు సహకారం, ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని చెప్పారు. భీమిలి ఎంతో అందమైన, ప్రశాంతమైన ప్రాంతమని ఇంతటి గొప్ప ప్రదేశం చాలా అరుదుగా ఉంటుందన్నారు. ఇక్కడ ప్రముఖ రచయిత చలం, ఆయన కుమార్తె సౌరీస్‌తోపాటు ఎందరో గొప్పవారు ఉన్న స్థలమని, దీనికి ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. కళలను ప్రోత్సహిస్తూ కళాసాహితి సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా తాను రచించిన పాటలు పాడారు. సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, గౌరవాధ్యక్షుడు రేలంగి పెదబాబు, సభ్యులు అడిదం కిశోర్, కాళ్ల సన్నీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో పారుగు సేవ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ సహజ మరణం పొందిన కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో ప్రజా ఆరోగ్య విభాగంలో పారుగు సేవ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ మరణించిన కుటుంబాలకు సోమవారం ఎక్స్‌గ్రేషియా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2019 ఫిబ్రవరి 18 నుంచి మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుకు జీవీఎంసీ నిధుల నుంచి సహజంగా మరణించిన వారికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5లక్షలు మంజూరు చేశామన్నారు. అప్పటి నుంచి జీవీఎంసీలో పారుగు సేవల్లో 174 మంది కార్మికులు మృతి చెందగా, దరఖాస్తు చేసుకున్న 82 మంది కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు, రూ.5లక్షలు చొప్పున మొత్తంగా రూ.కోటి 73 లక్షలు అందజేసినట్టు చెప్పారు. మిగిలిన 92 మందిలో దరఖాస్తు చేసుకున్న అర్హత గల కార్మికుల కుటుంబ సభ్యులకు జోనల్ స్థాయి అధికారి ద్వారా ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు.

రేపటి నుంచి ఎంఎస్‌ఎంఈ ఎక్స్ పో



ఎక్స్ పో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌ఎంఈ ఏడీలు, వాసీవా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఎంఎస్‌ఎంఈ ఎక్స్ పో – 2024ను బుధ,గురువారాల్లో నిర్వహించనున్నట్టు ఎంఎస్‌ఎంఈ ఏడీ జేసీ చంద్రమౌళీ, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగ ప్రసాద్ చెప్పారు. సోమవారం వాసీవా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎక్స్ పో – 2024 బ్రోచర్‌ను ఎంఎస్‌ఎంఈ ఏడీలు, వాసీవా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ ఎక్స్ పో – 2024 వాసీవా సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఎక్స్ పో ముఖ్య ఉద్దేశమన్నారు. పలు ప్రభుత్వ రంగసంస్థలు, బ్యాంకులు, పలుపరిశ్రమల తయారీ ద్వారా ఉత్పత్తులతో స్టాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. రెండు రోజుల పాటు బ్యాంకులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సమాచారాన్ని ఎక్స్ పో ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటోనగర్‌లోని డీ– బ్లాక్‌లోని ఎంఎస్‌ఎంఈ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఎక్స్ పోను నిర్వహించనున్నామన్నారు. ప్రారంభ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సత్యవతి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఏ.శ్రీను, ఏడీ బి.ప్రభాకర్ కుమార్, వాసీవా ప్రధాన కార్యదర్శి పీవీ రామ్ ప్రసాద్, కోశాధికారి పి.ప్రభాకర్, మెంబర్ రామభద్రరాజు, ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 72 ఫిర్యాదులు

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ సీపీ డాక్టర్ కె.ఫకీరప్ప పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. జాయింట్ సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. సత్వరమే వాటిని ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీపీ–1 మణికంఠ, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, డీసీపీ (క్రైమ్) పల్లా వెంకటరత్నం, ఏడీసీపీ(అడ్మిన్) ఎంఆర్‌కే రాజుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏపీలో 'ఆప్' పోటీ

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పోటీ చేయనుందని ఆప్ ఏపీ అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్ తెలిపారు. విశాఖ, అనకాపల్లి, అరకు, ఏలూరు, విజయవాడ, తిరుపతి, కడప పార్లమెంట్ స్థానాలతో 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేస్తోందని చెప్పారు.

సకాలంలో అర్జీల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం (జేకేసీ)లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. నిర్దేశిత కాలవ్యవధిలో అర్జీలకు పరిష్కారం చూపాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జేసీ అధ్యక్షతన జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. వారి నుంచి జేసీ, డీఆర్వో ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులకు జాయింట్ కలెక్టర్ పలు మార్గదర్శకాలు జారీ చేశారు. మొత్తం 226 వినతులు అందాయన్నారు. అందులో రెవెన్యూ విభాగానికి 72, జీవీఎంసీకి 60, పోలీసు విభాగానికి 16, ఇతర విభాగాలకు 78 ఉన్నాయి. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీసు, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోసం వినతి

ఇప్పుడు ఇస్తున్న పింఛను పెంచాలని దివ్యాంగులు కోరారు. సోమవారం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్టు దివ్యాంగుల రైట్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛను కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, దాన్ని రూ.8 వేలకు పెంచాలని ఆయన కోరారు.

జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'కు 82 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 82 వినతులు అందాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జీవీఎంసీ అన్ని జోన్ల పరిధి నుంచి 82 ఫిర్యాదులు వచ్చాయని, వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సింహాచలం: జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ సత్యారావు తెలిపారు. 5వ తరగతికి సంబంధించి సింహాచలం బాలుర గురుకుల పాఠశాలలో 160 సీట్లు, పెదనరవ బాలురు పాఠశాలలో 80 సీట్లు, అన్నవరం(అమృతపురం) బాలికల పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4 తరగతులు చదివి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షలోపు ఉండాలన్నారు. బీసీ, ఈబీసీ అభ్యర్థులు 1.09.2013 నుంచి 31.08.2015 మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 1.09.2011 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు mjpapbcwseir.apcfss.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

సింహాచలం బీసీ కళాశాలలో: సింహాచలం బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని దాసరి సత్యారావు తెలిపారు. ఎంపీసీలో 60 సీట్లు, బైపీసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. 75 శాతం సీట్లు ఎంజేపీఏపీబీసీఆర్ స్కూల్స్, బీసీ హాస్టల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు, మిగిలిన 25 శాతం ఇతరులకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

1,500 దాటితే అనుబంధ పోలింగ్ కేంద్రం



మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట : ఓటర్ల సంఖ్య 1,500 దాటితే పోలింగ్ కేంద్రానికి అనుబంధంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ.తప్పకుండా పాటిస్తామని స్పష్టం చేశారు. సోమవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఓటర్ల జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సంఖ్యను అనుసరించి జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనుబంధ పోలింగ్ కేంద్రాల కోసం మంగళవారం వరకు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై వారి సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

సెమీస్‌కు కబడ్డీ పోటీలు



సెమీస్‌కు చేరిన జట్టుతో నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జరుగుతున్న 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు సెమీఫైనల్ దశకు చేరుకున్నాయి. 13 జిల్లాల నుంచి 13 కబడ్డీ జట్లు పోటీలకు హాజరయ్యాయి. మూడు పూల్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు. లీగ్ దశలో జరిగిన 15 పోటీల్లో కృష్ణా, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, ప్రకాశం, కడప, శ్రీకాకుళం జట్లు ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నాయి. కృష్ణా జిల్లా జట్టు కడప జట్టుపైన, శ్రీకాకుళం జట్టు నెల్లూరు జట్టుపై విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాయి. గుంటూరుతో విజయనగరం, ఈస్ట్ గోదావరితో ప్రకాశం జిల్లా జట్లు మిగిలిన రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో పోటీ పడుతున్నాయి. మంగళవారం ఉదయం క్వార్టర్ ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన నాలుగు జట్లు మధ్య సెమీఫైనల్ పోటీ జరుగుతుంది. ఇందులో విజేతలైన రెండు జట్ల మధ్య సాయంత్రం ఫైనల్ పోటీ నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సోమవారం సాయంత్రం తిలకించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ముప్పల సురేష్, అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు శ్రీకాంత్, ప్రసాదరెడ్డి, ఎస్.రమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్లకు అవార్డులు



ఢిల్లీలో అవార్డులు అందుకుంటున్న లైన్‌మన్లు

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు విద్యుత్ ప్రమాద రహిత సంస్థగా గుర్తింపు తీసుకురావాలని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సిబ్బందికి పిలుపునిచ్చారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నేతృత్వంలో సోమవారం టాటా పవర్ ఢిల్లీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ (టాటా పవర్ 'సేవ, సురక్ష, స్వాభిమాన్' పేరుతో లైన్‌మన్ల సేవలను గుర్తించి దేశవ్యాప్తంగా లైన్ మన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విశాఖ సర్కిల్ కార్యాలయం నుంచి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ లైన్‌మన్లగా ఆముదాలవలసకు చెందిన మీసాల రామస్వామి, బుట్టాయగూడెంకు చెందిన రాధాకృష్ణ, సంపత్‌నగర్‌కు చెందిన కొండాచారీలకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. లైన్‌మన్ల ఉద్యోగమంటేనే ఎన్నో సవాళ్లతో కూడినదన్నారు. అటువంటి వారికి అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రధానమంత్రి జన్–మన్ యోజన పథకంలో విద్యుత్ సౌకర్యం లేని గిరిజన ఆవాసాల్లో అతి తక్కువ సమయంలో 14 వేల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచామన్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు ఓఅండ్ఎం స్టాఫ్ నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విశాఖ సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు ఉత్తమ సేవలందించడంలో ప్రతిభ కనబరిచిన 17 మందికి ఉత్తమ లైన్‌మన్లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్) సి.శ్రీనివాసమూర్తి, ఎస్ఈ, ఎల్.మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెట్లకు సత్కారం

విశాఖ స్పోర్ట్స్ : గత నెలలో పుణేలో జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన విశాఖ అథ్లెట్లను ఆదివారం జిల్లా గ్రంథాలయంలో సత్కరించారు. ఈ పోటీల్లో జయంతిమాల రెండు స్వర్ణాలు ఒక రజత పతకాన్ని సాధించగా.. లలితాదాస్ ఒక రజత, కాంస్య పతకంతో పాటు రిలే పరుగులో వీరిద్దరూ కాంస్యాన్ని సొంతం చేసుకున్న జట్టులో సభ్యులు. లావణ్య కాంస్య పతకం సాధించారు. మాస్టర్ అథ్లెట్ రాంబాబు రెండు రజత పతకాల్ని సాధించగా గోవింద్‌తో కలిసి రిలే పరుగులో కాంస్య పతకాన్ని అందుకున్నారు.

8న సింహగిరిపై మహా శివరాత్రి ప్రత్యేక పూజలు

సింహాచలం: ఈనెల 8న మహా శివరాత్రిని పురస్కరించుకుని సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి అలయాల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి మహా రుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో రూ.64 లక్షల టోకరా

విశాఖ సిటీ: వాట్సాప్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేసిన వ్యక్తికి స్టార్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో నేరగాళ్లు రూ.64 లక్షలకు టోకరా వేశారు. బాధితుడి నేరగాళ్లకు పంపించిన నగదు విశాఖకు చెందిన ఒక వ్యక్తి ఖాతాకు వెళ్లడంతో అతడి ద్వారా హైదరాబాద్‌కు చెందిన మరో నలుగురిని సైబర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిని వివరాల ప్రకారం.. విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి తెలియని వాట్సాప్ గ్రూప్‌లో ఇన్విటేషన్ లింక్ వచ్చింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఉన్న ఆ లింక్‌ను క్లిక్ చేసి బాధితుడు అందులో జాయిన్ అయ్యాడు. అందులో ఆజీమ్ సింగ్ అనే వ్యక్తి స్టాక్ కొనుగోలు, అమ్మకానికి, కాల్ ఆప్షన్లు ఇవ్వడానికి గల అవకాశాలపై ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అతడు జోక్షా ప్లాట్ ఫారంలో ఫారెన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్‌గా ట్రేడర్ సీటు తీసుకుంటే ఐపీఓలో విపరీతమైన రాబడి వస్తుందని బాధితుడ్ని నమ్మించాడు. కొన్ని రోజులకు అతని మాటలు నమ్మిన బాధితుడు రూ.64 లక్షలు డిపాజిట్ చేసి మోసపోయాడు. దీంతో ఆయన విశాఖ సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప ఆధ్వర్యంలో సైబర్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు నేరగాళ్లకు పంపించిన నగదు విశాఖలోని ఒక వ్యక్తి బ్యాంక్ ఖాతాకు వెళ్లినట్లు గుర్తించారు. అతని అకౌంట్ నుంచి డబ్బులు హైదరాబాద్‌లో మరికొన్ని బ్యాంక్ ఖాతాలకు వెళ్లినట్టుగా తెలుసుకున్నారు. దీంతో పోలీసులు తెలంగాణకు వెళ్లి చాకచక్యంగా ఐదుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా యూఎస్‌డీటీ క్రిప్టో ట్రేడింగ్ చేస్తున్నట్లుగా చెప్పారు. థాయిలాండ్‌లో తక్కువ ధరకు యూఎస్‌డీటీ క్రిప్టో వస్తుండడంతో అక్రమ పద్ధతుల్లో వివిధ అకౌంట్ల ద్వారా డబ్బును డాలర్స్ రూపంలో మార్చి థాయిలాండ్‌కు స్విఫ్ట్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. అక్కడ థాయిలాండ్ బ్యాంకులో నేరస్తులు తెరిచిన బ్యాంక్ ఖాతాల్లో ఈ డబ్బు డాలర్లుగా డిపాజిట్ అవుతున్నట్లు పోలీసులకు చెప్పారు. ఆ డాలర్స్‌తో బినాన్స్ ప్లాట్‌ఫారంలో యూఎస్‌డీటీ క్రిప్టోని కొనుగోలు చేసి దానిని భారత్‌లో ఉన్న వారికి రూపాయలలో విక్రయిస్తున్నారని పోలీసులు విచారణలో వెల్లడైంది. అయితే అసలు సూత్రధారులు మారో ఐదుగురు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వారి కోసం గాలిస్తున్నారు.

సృజనశీలి కిరణ్‌ప్రభ



కిరణ్ ప్రభ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట: ఫొటో కవితలు, టాక్ షోస్, అంతర్జాల పత్రిక నిర్వాహకుడిగా దేశ విదేశాలలో తెలుగు వారిని అలరిస్తున్న గొప్ప సృజనశీలి కిరణ్ ప్రభ కౌముది అని వక్తలు కొనియాడారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, స్నేహకుటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రముఖ టాక్ షోస్ మాంత్రికుడు కిరణ్ ప్రభ (అమెరికా)తో ఇష్టా గోష్ఠి, ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కిరణ్ ప్రభను సభకు పరిచయం చేసిన స్నేహకుటి ట్రస్టు పాలడుగు రాజశేఖర్ మాట్లాడుతూ కొన్ని వందల పరిశోధనాధారిత టాక్ షోస్ నిర్వహించిన ప్రయోక్త కిరణ్ ప్రభ అన్నారు. సినిమా, సాహిత్యం, రాజకీయం, సైన్స్, నాటకం తదితర రంగాలకు సంబంధించి పరిశోధనాత్మక, వివరణాత్మక టాక్ షోస్‌తో యావత్ ప్రపంచాన్ని అలరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కిరణ్ ప్రభ టాక్‌షోస్‌కు 500 మిలియన్ల వ్యూస్ ఉన్నాయంటే అతని ప్రతిభ ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు.

ఈ సందర్భంగా కిరణ్‌ప్రభ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో నరవప్రకాశ రావు,చిన్నారావు, జవహర్ పాల్గొన్నారు.